క్లుప్తంగా

శ్రీవారికి వెండి పళ్లెం బహూకరణ

ద్వారకాతిరుమల: శ్రీ వారికి ఒక భక్తురాలు సోమవారం రూ.1.45 లక్షల విలువైన 1.480 కేజీల బరువు గల వెండి (3 ఏనుగుల వేళ్లతో తయారు చేయబడిన) పళ్లెంను బహూకరించారు. విజయవాడలోని పోరంకికి చెందిన ఉయ్యూరు ప్రియాంక ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆమె ఈ వెండి పళ్లెంను ఆలయ కార్యాలయంలో ఏఈవో ఎమ్ఎస్ఎల్ శ్రీనివాస్‌కు అందించి, స్వామి వారి సేవలకు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా దాత ప్రియాంకకు ఆయన సంబంధిత రసీదును అందించారు.

డైవర్షన్ రహదారికి మరమ్మతులు



మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పట్టిన్నపాలెంలో జల్లేరు వాగుపై నిర్మించిన డైవర్షన్ రహదారి మరమ్మతు పనులను సోమవారం చేపట్టి పూర్తి చేశారు. మరమ్మతుల అనంతరం వాహనాల రాకపోకలు కొనసాగాయి. భారీ వర్షాలకు వాగు ఉధృతిగా ప్రవహించి డైవర్షన్ రహదారి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. స్థానికులు స్వచ్ఛందంగా జేసీబీ సహాయంతో మరమ్మతు పనులు చేపట్టారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదానం చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఫుడ్ ఫౌండేషన్ కొయ్యలగూడెం శాఖ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సురక్ష హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో డాక్టర్ కొండముది దిలీప్ కుమార్, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. దశాబ్దకాలంగా దిలీప్ కుమార్ ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో వైద్య సేవలు నిర్వహిస్తూ పేద వర్గాల వారి మన్ననలు పొందారన్నారు. 45 మంది యువతీ, యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ వేలేరుపాడు, కుక్కునూరు మండలాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జీలుగుమిల్లి సీఐగా వెంకటేశ్వరరావు



సీఐ వెంకటేశ్వరరావు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం సీసీఎస్‌లో పని చేస్తున్న వెంకటేశ్వరరావును సాధారణ బదిలీల్లో భాగంగా జీలుగుమిల్లి సీఐగా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

మెరుగైన సేవలే లక్ష్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రానికి వచ్చే భక్తులకు, మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ద్వారకా తిరుమల నూతన ఎస్సై టి.సుధీర్ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన, సాధారణ బదిలీల్లో భాగంగా ద్వారకా తిరుమలకు బదిలీపై వచ్చారు. సోమవారం సాయంత్రం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్సై సుధీర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరి రక్షణకు ప్రాధాన్యతను ఇవ్వడంతో పాటు, నేరగాళ్లపై ప్రత్యేక నిఘా పెంచుతామన్నారు.

కేటుగాడ్ని పట్టుకునేందుకు విఫలయత్నం

ద్వారకాతిరుమల: పోలీసుల ముసుగులో వ్యాపారులను మోసగిస్తున్న కేటుగాడిని పట్టుకునేందుకు పోలీసులు, ఒక వ్యాపారి చేసిన ప్రయత్నం విఫలమైంది. వివరాల్లోకి వెళితే. గ్రామానికి చెందిన కొందరు వ్యాపారులకు ఓ కేటుగాడు ఫోన్ చేసి తాను ఏఎస్సై అని పరిచయం చేసుకొని, తనకు అర్జెంటుగా ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపి, తన కానిస్టేబుల్‌తో పంపుతున్న క్యాష్ తీసుకోవాలని మోసగిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం స్థానిక కల్యాణ మండపం యజమాని ఓజీఆర్ కుమార్‌కు ఫోన్ చేసిన వ్యక్తి తాను ఏఎస్సై భాస్కరరెడ్డినని చెప్పి, కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంకు యాక్సిడెంట్ అయ్యి ఆస్పత్రిలో ఉన్నాడని, వెంటనే రూ.30 వేలు ఫోన్‌పే ద్వారా పంపి, తాను కానిస్టేబుల్‌తో పంపుతున్న క్యాష్ తీసుకోవాలన్నాడు. ఇదే తరహాలో సొసైటీ కార్యదర్శి నల్లూరి కిషోర్‌కు ఫోన్ చేసి రూ.50 వేలు అడిగాడు. వారిద్దరు విషయాన్ని గ్రహించి జాగ్రత్త పడ్డారు. కేటుగాడు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సిమెంట్ దుకాణం యజమాని పొనమాల నాగరాజుకు ఫోన్ చేసి రూ.50 వేలు అడిగాడు. నాగరాజు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయాన్ని చెప్పాడు. పోలీసులు, వ్యాపారి కలిసి ఆ మోసగాడికి ఫోన్ చేసి డబ్బులు పట్టుకు రమ్మన్నారు. పసిగట్టిన కేటుగాడు వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. మోసగాడిని పట్టుకోవాలన్న వారి ప్రయత్నం బెడిసి కొట్టింది.

పశువులకు సంజీవని టీకాలు

జంగారెడ్డిగూడెం: భారతదేశంలో పశు సంపదను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ముఖ్యమైన చర్యల్లో పాద, నోటి వ్యాధి (ఎఫ్ఎండీ) (గాలికుంటు వ్యాధి) నియంత్రణ కార్యక్రమం ఒకటి. ఈ కార్యక్రమం పశువులకు సంజీవనిలా పని చేస్తుంది. ఈ నెల 20 నుంచి ఈ కార్యక్రమం పశు సంవర్ధక శాఖ ద్వారా ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 18 వరకు కార్యక్రమం కొనసాగనుంది. గాలికుంటు వ్యాధి (పాద, నోటి వ్యాధి (ఎఫ్ఎండీ)) అనేది అంటువ్యాధి. ఇది పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులలో వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వలన జంతువుల నోటిపై, పాదాలపై పుండ్లు ఏర్పడతాయి. దీని వల్ల వాటి ఉత్పాదకత గణనీయంగా తగ్గుతుంది. గాలికుంటు వ్యాధి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని (ఎన్ఏడీసీపీ) ప్రారంభించినట్లు పశు వైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ తెలిపారు. ఈ కార్యక్రమం కింద 2025 నాటికి ఎఫ్ఎండీని నియంత్రించడం, 2030 నాటికి ఎఫ్ఎండీని నిర్మూలించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 20 నుంచి టీకా కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ ప్రారంభిస్తుంది. కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా 500 మిలియన్‌లకు పైగా పశువులకు టీకాలు వేయనున్నారు. ఈ టీకాను కేంద్రం ఉచితంగా అందజేస్తుంది. ప్రతీ పశువుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇచ్చి, టీకా ఇవ్వడం, అనంతర పరిస్థితులను పర్యవేక్షిస్తారు. గాలికుంటు వ్యాధి నివారణకు నిర్వహించే టీకాలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక పశు వైద్యాధికారిని గాని, 1962 టోల్ ఫ్రీ నెంబరు గాని సంప్రదించవచ్చు.





గాలికుంటు వ్యాధి సోకి పశువులకు పుండ్లు పడిన దృశ్యం

పశువులకు తప్పనిసరిగా టీకా వేయించాలి



ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే ఎఫ్ఎండీ టీకా కార్యక్రమం భారతదేశ పశు సంపద ఆరోగ్యానికి ఒక ముఖ్యమైన మైలురాయి. ఇది కేవలం జంతువుల ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా, లక్షలాది రైతుల జీవనోపాధిని కూడా రక్షిస్తుంది. 2030 నాటికి ఎఫ్ఎండీ నిర్మూలన లక్ష్యాన్ని సాధించడానికి అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరం. ముఖ్యంగా పశు పెంపకందారుల కార్యక్రమ ఉద్దేశ్యాన్ని అవగాహన పెంచుకొని వారి పశువులకు టీకాలు వేయించుకోవాలి. టీకాను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంది. 4 నెలలు దాటిన ప్రతీ పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలి.

– డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్, పశు వైద్యాధికారి

పశువుల్లో కనిపించే వ్యాధి లక్షణాలు:

- తీవ్రమైన జ్వరం, నీరసం
- కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం
- చూడి పశువులు ఈసుకుపోవడం
- ఎద్దులలో పని సామర్థ్యం తగ్గడం

వ్యాధి వలన కలిగే నష్టాలు:

- పాల ఉత్పత్తి, పని సామర్థ్యం తగ్గుతుంది
- రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుతుంది
- పాలు తాగే దూడలలో మరణాలు అధికంగా ఉంటాయి.
- వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోవడం, రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతుంది.

టీకాల వలన కలిగే లాభాలు:

- పాల ఉత్పత్తి 5 నుంచి 10 శాతం పెరుగుతుంది.
- గొర్రెలు వంటి పశువుల మాంసం నాణ్యత పెరిగి, ఎగుమతులు పెరిగే అవకాశం ఉంటుంది.
- చికిత్స ఖర్చులు తగ్గుతాయి.
- నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా పశు పెంపకందార్లకు మేలు జరిగి నూతన వ్యాపార మార్గాలు పెరిగే అవకాశం ఉంటుంది.
- వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని నివారించవచ్చు.
- దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడుతుంది.
- పశువుల గుర్తింపునకు చెవి పోగు వేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుంది.

కనీసం రెండేళ్లు పని చేయాలి

బుట్టాయగూడెం: మండలంలోని కోట రామచంద్రాపురం (కేఆర్ పురం) ఐటీడీఏ పీఓగా నియమితులైన అధికారులు కనీసం రెండేళ్లు విధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను కోరారు. బుట్టాయగూడెంలో సోమవారం ఆ సంఘ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీడీఏలో పని చేస్తున్న పీఓలు కనీసం 6 నెలలు పని చేయకుండానే బదిలీపై వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుంజం కృష్ణంరాజు, పూసం శ్రీను, తెల్లం సూరిబాబు, తామ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొయ్యలగూడెం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో గవరవరం, చొప్ప రామన్నగూడెం గ్రామాలలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం డీఈ పి.రాధాకృష్ణ పేర్కొన్నారు. రాజవరం ఫీడర్ లైన్ వెంబడి చెట్ల కొమ్మలు కటింగ్ చెయ్యనున్న నేపథ్యంలో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మానవహారం నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ మానవహారం

బుట్టాయగూడెం: కలకత్తాలోని ఆర్‌జీకేఏఆర్ మెడికల్ కాలేజీ సెకండ్ ఇయర్ పీజీ విద్యార్థిని హత్యను నిరసిస్తూ సోమవారం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అలాగే స్థానిక నెహ్రూ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యతని నినదించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో జె.సురేష్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల పీజీ సెకండ్ ఇయర్ విద్యార్థినిపై జరిగిన సంఘటనను తీవ్రంగా ఖండించారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ కూడా చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జ్ఞానేష్, మురళీధర్, దివ్య, రెండు మండలాలకు చెందిన వైద్యారోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో ర్యాలీ

కొయ్యలగూడెం: వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యకు నిరసనగా పీడీఎస్‌యూ నాయకులు బి.వినోద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో వైద్య విద్యార్థిని మృతికి నిరసనగా ఆందోళన, ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలి మృతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరపాలని, నిందితుడు సంజయ్‌ను కఠినంగా శిక్షించి, బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కళాశాల నాయకులు గురుగుంట్ల ఉదయ్, డి.రవీంద్ర, శీలమంతుల వినయ్, గురుగుంట్ల భాస్కర్, కె.వికాస్, ఎస్ చిన్నారెడ్డి, ఎస్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది కొవ్వొత్తుల నిరసన

చింతలపూడి: కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారాన్ని నిరసిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైద్యులపై దాడులు, అత్యాచార ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వినతి

కొయ్యలగూడెం: మంగపతిదేవి పేట పంచాయితీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలంటూ రైతులు విజ్ఞప్తి చేశారు. సోమవారం గవరవరంలోని ప్రధాన సబ్‌స్టేషన్‌లో ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలోని ప్రధాన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ తరచూ మరమ్మతులకు గురవుతోందని దీని వలన గృహ అవసరాలతో పాటు వ్యవసాయ అవసరాలకు నాణ్యమైన విధంగా విద్యుత్ సరఫరా అవ్వడం లేదన్నారు. విద్యుత్ హెచ్చు తగ్గుల కారణంగా గృహోపకరణాలు పాడైపోతున్నాయని వినతి పత్రంలో వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా విద్యుత్ అవసరాలకు సరిపడా నీరు లేకపోవడంతో వరి చేలు ఎండిపోతున్నాయన్నారు. గతంలో సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. సీపీఐ మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్, పార్టీ శ్రేణులు మద్దతు తెలిపి వారి సమస్యను పరిష్కరించాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులకు మరో వినతి పత్రం సమర్పించారు. యు.నాగరాజు, చిడిపి వెంకటరావు, కట్టా వెంకటేశులు, గెల్లా సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం సబ్ స్టేషన్‌లో వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

మానవత సంస్థ శాంతి ర్యాలీ

జంగారెడ్డిగూడెం: మానవత సంస్థ జంగారెడ్డిగూడెం శాఖ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీని సోమవారం సీఐ రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సంస్థ చేసే కార్యక్రమాలను కొనియాడారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవత సంస్థకు పర్యావరణానికి సంబంధించి మొక్కలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, రీజియస్ చైర్మన్ త్రిపుర సుందరి, ఆడిట్ కమిటీ చైర్మన్ ధల్లి కేదారేశ్వర రెడ్డి, జాయింట్ సెక్రటరీ పల్లి వెంకటరెడ్డి, పర్యావరణ కమిటీ కన్వీనర్ ధల్లి రామాంజనేయ రెడ్డి, మానవత సభ్యులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సంస్థ సభ్యులు

గిరిజనులకు న్యాయం చేయాలి

జంగారెడ్డిగూడెం: గిరిజనుల భూముల్లో భూస్వాములకు ఇచ్చిన ఆర్డర్ చట్ట విరుద్ధమని తక్షణమే రద్దు చేసి, గిరిజనులకు న్యాయం చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి.రామకృష్ణ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ బుట్టాయిగూడెం మండలంలో మరలగూడెం రెవెన్యూ భూముల్లో 25 సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే భూస్వాములకు అండగా ఉన్న గత ఆర్డీవో ఝాన్సీ రాణి వైఖరిని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ఖండించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న ఎల్‌టీఆర్ భూముల్లో జంగారెడ్డిగూడెం మైసన్నగూడెం, శ్రీనివాసపురం, భూస్వాములకు ప్రొసీడింగ్స్ ఆర్డర్లు ఇవ్వడం దుర్మార్గమన్నారు. 1/70 చట్టం ఎల్‌టీఆర్ భూములకు ఇచ్చిన ఆర్డర్ పరిశీలించి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఏలూరు కలెక్టర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం, మండల కమిటీ సభ్యులు మనకు వెంకటేశ్వరరావు, కోసం పుల్లయ్య దేవి, అందుగుల ప్రభాకరరావు, జి.సూర్య కిరణ్, గిరిజనులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఏఐటీయూసీ వాల్‌పోస్టర్ విడుదల

వేలేరుపాడు: విశాఖపట్నం వేదికగా సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాల వాల్‌పోస్టర్‌ను సోమవారం వేలేరుపాడు మండలంలోని బుర్రతోగులో ఆ సంఘ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి కారం దారయ్య మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, సొంత గనులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను, కాంట్రాక్ట్ ఉద్యోగాలను రద్దుచేసి, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, 26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు వెంటనే న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి చందా రమాదేవి, కొలూరి సైదా, జి.వెంకటేశ్వరి, కరటం సీతామహాలక్ష్మి, కారం కుమారి, స్కీం వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

వేడుకలా రక్షాబంధన్

కొయ్యలగూడెం: రక్షా బంధన్ వేడుకలను ప్రజలు సోమవారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అన్ని సామాజిక వర్గాల వారు తమ తోబుట్టువులకు ఈ సందర్భంగా రాఖీలను కట్టి వారి వద్ద నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. మార్వాడి, జైన జైన మహిళలు ఘనంగా వేడుకలు నిర్వహించి, స్వీట్స్ పంపిణీ చేశారు. చిన్నారులు సైతం రక్షాబంధన్ గురించి తెలుసుకోవాలని మదన గోపాల స్వామి ఆలయ కమిటీ అర్చకులు గుడి శేషాచార్యులు తెలిపారు. శ్రావణ పౌర్ణమి రోజున రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి అనే పేర్లతో వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కృతయుగం మొదలుకొని నేటి కలియుగం వరకు అవతరించిన దేవతామూర్తులలో అనేక మంది రక్షాబంధన్ కట్టించుకొని తోబుట్టువుల అన్యోన్యతను చాటిన వారేనని ఆయన తెలిపారు.



రక్షాబంధన్ పురస్కరించుకొని రాఖీలు కడుతున్న మహిళలు

వైభవంగా శ్రావణ మాస ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం శ్రవణా నక్షత్రము, శ్రావణ పౌర్ణిమ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం, విఖనస జయంతి వేడుకలు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వైష్ణవ ఆగమమైన వైఖానస ఆగమనమునకు మూల పురుషుడైన విఖనస మహర్షికి అష్టోత్తర పూజలు, నివేదన, మంగళ శాసనము మొదలగు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం ఏర్పాట్లను కార్య నిర్వహణ అధికారి మాణికల రాంబాబు పర్యవేక్షించారు.

వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డులో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సహిత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో 'విఖనస జయంతి' సందర్భముగా పండితులు, అర్చక స్వాములు స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారని, ఆలయ కార్య నిర్వహణాధికారి కొండలరావు తెలిపారు.



పారిజాత గిరిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చింతలపూడి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అధ్యక్షుడు బి.రాంబాబు నాయక్ సూచించారు. మండలంలోని రేచర్ల పంచాయితీ తండాలో సోమవారం యర్రగుంటపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని ఎంపీపీ రాంబాబు నాయక్ పరిశీలించారు. సీహెచ్‌వో సుధా భవానీ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డాక్టర్ ఊటుకూరుకు నాగ భైరవ పురస్కారం

కొయ్యలగూడెం: తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన నాగ భైరవ పురస్కారాన్ని అందుకున్నట్లు ప్రభుత్వ రిటైర్డ్ ఉపాధ్యాయులు కొయ్యలగూడెం గ్రామవాసి డాక్టర్ ఊటుకూరి వర ప్రసాద్ పేర్కొన్నారు. ఒంగోలులో 18వ తెలుగు రాష్ట్రాల స్థాయి సదస్సు భాషా విభూషణ బిరుదాంకితులు డాక్టర్ నాగ భైరవ ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా తనతో పాటు ఏనుగు నరసింహారెడ్డి, వైఎస్సార్ కృష్ణేశ్వరరావు, బీరం సుందరరావులను కలిపి మొత్తం నలుగురికి పురస్కారాలు విడివిడిగా అందించారన్నారు. తెలుగు భాషా ప్రావీణ్యతకు గత రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్న వ్యక్తులను ఈ పురస్కారానికి నిర్వాహకులు ఎంపిక చేశారన్నారు. తెలుగు భాషా సాహితీ ప్రియులతో పాటు, ద్రవిడ భాషలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారన్నారు.

గ్రామాభివృద్ధికి పాటు పడాలి



శిక్షణలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

కొయ్యలగూడెం: ప్రభుత్వం కల్పిస్తున్న రిఫ్రెషర్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధికి పాటు పడాలని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంజిమాల రామారావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన రిఫ్రెషర్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 21వ తేదీ వరకు మూడు రోజులు శిక్షణ ఇస్తారన్నారు. పరిపాలన విధానం, పారిశుద్ధ్యం, నిధుల వినియోగం తదితర అంశాల గురించి కోర్స్ డైరెక్టర్ జి.సతీష్ అవగాహన కల్పించారు. వేదాంతపురం కార్యదర్శి తాతబాబు, పొంగుటూరు కార్యదర్శి నాగేశ్వరరావు, గోపాలపురం మండల రిసోర్స్ పర్సన్ కె.సురేష్ శిక్షణ ఇచ్చారు.

ఏజెన్సీలో భారీ వర్షం



ముంజులూరులోని ఏనుగుతోపు జలపాతం

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో సోమవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు వర్షం కురవడంతో గుబ్బల మంగమ్మ తల్లి గుడి సమీపంలోని కొండ వాగులు పొంగిపొర్లాయి. అలాగే అమ్మవారి గుడిపై నుంచి వరద నీరు ఉధృతంగా పొంగిపొర్లింది. అదే విధంగా మండంలోని ముంజులూరు సమీపంలో ఏనుగుతోగు జలపాతం పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. గంట తర్వాత నీటి ప్రవాహ ఉధృతి తగ్గడంతో పర్యాటకులు సందడి చేశారు.

వైభవంగా పవిత్రారోహణ

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయంలో జరుగుతున్న శ్రీవారి దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం పవిత్రారోహణ వేడుక అత్యంత వైభవంగా నిరజరిగింది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో రెండు రోజులుగా విశేష కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉదయం ఆలయ యాగశాలలో హోమగుండం వద్ద అగ్ని ఆరాధన, చతుర్థ కలశస్నపనను అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగే పవిత్రావరోహణ, శ్రీ మహా పూర్ణాహుతి వేడుకలతో ఈ పవిత్రోత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.